
తానా 2005

# కోటిమొద్దు

- విప్లవ్



అదొక పల్లెటూరు.

ఇంకా రోడ్లూ, కాలువలూ, రాజకీయాలూ, లోకం పోకడలూ ఇవేవీ తగలని చిన్న గ్రామం. ఊర్లో అందరూ ఎప్పుడో ఒకప్పుడు తామంతా ఉన్నవాళ్లమే అనో లేక ఏదీ లేని వాళ్లమనో అనుకునేవాళ్లు. ఒకళ్లతో పోల్చుకోవడానికి కార్లూ, పెద్దగా చదువుకున్నవాళ్లుగానీ ఆ ఊరికి వచ్చిన ట్టులేదు. ఇవన్నీ చెప్పాక, ఈ నాటికాలం కాదనివేరే చెప్పక్కరలేదు.

అట్లాంటి ఊళ్లో చంద్రయ్య, సోమయ్య అనిపేర్లు గల ఇద్దరు అన్నదమ్ములున్నారు. ఊళ్లో అందరికీ తల్లో నాలుకలా మెలిగే తమ్ముడు సోమయ్యకు, తక్కువ మాట్లాడినా మంచి పని మంతునిగా పేరు తెచ్చుకున్న చంద్రయ్యతోడుగా జోడెద్దుల్లా వుండేవాళ్లు. తండ్రి మిగిల్చిపోయిన ఒకే ఒక్క చెక్క భూమి దాదాపు ఇరవై ఎకరాల చెలక కలిసే దున్నేవాళ్లు. అరకలు కలిసే కట్టేవాళ్లు. రోజూ రేకలు బారకమునుపే చంద్రయ్య పశువుల కొట్టం వైపు వెళితే, సోమయ్య మేకలకు తుమ్మమండకొట్టడానికి వెళ్లేవాడు. వాళ్ల తండ్రి వాళ్లకు మిగిల్చినది ఊళ్లో ఎంతో మంచిపేరు, ఆ భూమికి తోడుగా. తండ్రి చనిపోయే ముందు ఆ ఊళ్లో అప్పు ఇచ్చేవాడూ, అంతో ఇంతో వైద్యం తెలిసిన వాడూ, కర్మ చేసేవాడూ వున్నంతవరకూ ఆ ఊరు వదలొద్దు, ఆ చెల్క అమ్మొద్దు అని మాత్రం చెప్పేవాడు. ఇప్పటి కాలాని కొస్తే, ఇంకెక్కడి తుమ్మలూ, మండలూ, అవన్నీ పోయి మొద్దులు మాత్రం ఇంకా మిగిలున్నయి. ఆ కాలమే వేరు.

***

మళ్లీ కథలోకొస్తే, ఆ ఇద్దరన్నదమ్ములకూ పెండ్లీలయినాయి. భార్యలు కాపురానికి వచ్చినరు. ఇద్దరు తోటికోడళ్లూ అంతో ఇంతో తెచ్చినా, కుటుంబంలో ఒక్కతీరుగనే కలిసిపోయినరు. రెండు అరకలు కడితే వెనకాలే నడుస్తూ పిత్తులు వేసినా, తెల్లవారగానే ఆమదుపు చేలల్లో కాసిన దోసకాయలను ఏరి తెచ్చినా, ప్రతిపనికీ అంతా కలిసే వెళ్లేవాళ్లు. కలిసి పెట్టుకున్న కూరాడు పక్కనే ఒకే కుంపటి మీదే సర్వనిండా అన్నం, కూరలూ, ముసలావిడ, అంటే చంద్రయ్యా, సోమయ్యల తల్లీ, ఉన్నంతలో వండిపెట్టేది. ఎండనెత్తి మీదికి వచ్చేలోపే, ఇద్దరన్నదమ్ములూ ఇల్లు చేరి మళ్లీ ఎండ అగడు తగ్గినాక, పశువులూ మేకలూ అన్నిటినీ పట్టించుకుని బాగా రాత్రి కాక మునుపే ఇల్లు చేరేవాళ్లు. వాళ్లిద్దరి తండ్రి చనిపోయి నాలుగేళ్లయినప్పటి మాట ఇది.

తండ్రి మిగిల్చిన పేరు నిలబెట్టేవాళ్లుగా ఊరంతా ఈ ఇద్దరు కొడుకులనూ ఆదర్శంగా చెప్పుకుంటున్న పరిస్థితి. వానలు సరిగ్గా పడితే నాలుగుపుట్ల ఆముదాలు పండించుకునీ, చెల్కలో పండిన దోసకాయలతో రోజుకొక రకంగా వాటినే కూర చేసుకుని హాయిగా, మరే

చీకూ చింతా లేకుండా గడిపేసే కాలం. తండ్రి వుండగా, ఒక్కనాడూ అప్పు ఎరగని కుటుంబమది. ''అసలు అప్పు ఎందుకు చేస్తారో అనవసరంగా లేని తలనొప్పులు ఎందుకు చుట్టుకుంటారో మనుషులు' అనుకునే అమాయక పల్లెటూరి దిగువ మధ్యతరగతిలో వున్నా, గుట్టుగానే అయినా, అంతో ఇంతో బాగా బతుకుతున్నారని లోకమనుకునే చిన్నతరహా రైతులు వాళ్లు.

ఇంట్లో తండ్రికి నాలుగో సంవత్సరీకం పెట్టినాక వచ్చిన దసరానాడు చంద్రయ్య భార్య రాధమ్మ మంచి వార్తొకటి చెప్పింది. ఆ ఇంట్లోకి ఒక చిట్టిపాపనో, బాబో రాబోతున్నాడని. ఇల్లంతా ఒక్కటి చేసి పెట్టాడు సోమయ్య. అన్నావదినెల సంతోషంలో పాలు పంచుకుంటూ.

ఒకరాత్రి ఇంట్లో అందరి భోజనాలూ అయ్యాక బయట అరుగుమీద కూర్చుంటూ అన్నతో ఒకమాటన్నాడు. అన్నా, ఇవ్వాళంటే, మనమిద్దరమే వున్నాం. రేప్పొద్దున మన పిల్లలూ, వాళ్లూ ఈ చెల్కలోనే బతకాలంటే కష్టమేమో, ఊళ్లో ఒక్కొక్కడూ బావులు తవ్వి వాటికింద ఒకటో రెండో ఎకరాలు అచ్చుకడుతున్నారు, డీజెల్ ఇంజనులు పెట్టి, మనమూ చేస్తే అని.

''అవన్నీ మనకెందుకురా, మనవల్ల అయ్యేపనులు కావవి, లేనిదొకటి ఇప్పుడెందుకు'' మెత్తగా మందలించాడు అన్న చంద్రయ్య.

అప్పుడే బయటకొస్తూ విన్న చంద్రయ్య భార్య రాధమ్మ మాత్రం ''మనం వద్దనుకున్నా మన చెల్కకు మీదనే వున్న వడ్లాయన రేపే ఒక బాయి తవ్వుతున్నాడట తన కొడుకూ కోడలితో కలిసి. రెండు గడ్డపారలూ, నాలుగు తట్టలూ వుంటే వొక బావి తొవ్వడం ఇవ్వాళ్రేపాక లెక్కా అన్నది గా వడ్లాయన పెండ్లాం.'' చెప్పిందావిడ.

''ఏమోరా నాకు అదంతా పరుగెత్తి పాలు తాగే యవ్వారం లాగనే కనిపిస్తున్నది'' పెదవి విర్చాడు మరోసారి తన తమ్మునికేసి చూస్తూ.

''మనమేం డీజిల్ ఇంజన్ కొనపనిలేదు, ఇవ్వాళ్రేపు వున్న నాలుగు కోడెలూ సగం రోజులు ఖాళీగనే వున్నయి, మోటకొడితే సరిపోతుంది.'' తోటికోడలు అరుణమ్మ చెప్పింది.

ఇదయిన నాలుగు వారాలకు, ఇద్దరన్నదమ్ములూ కావలసిన పనిముట్లు తెచ్చుకుని నెలరోజుల్లో ఆరు కోలల బావి తవ్వి తీశారు నీళ్లు పడతాయో పడవో అని ఇంటిపట్టునే వున్న మరొక చేద బావి వరుసను కలుపుకుని.

అదృష్టం కొద్దీ నీళ్లు పడగానే మూడు కొబ్బరికాయలు కొట్టి పటికబెల్లం పూజకు నైవేద్యంగా పెట్టి ముత్యాలమ్మకు కల్లు ఆరబోసినారు బావినుండి బయటకు తోడిన మట్టిదిబ్బమీద.

ఒక్క ఎకరం పొలం అచ్చుకడితే తమ తిండి గింజల వరకు సరిపోతుంది అనుకున్నది, బాగానే వచ్చిన నీళ్లను చూసి రెండు ఎకరాలకు నీళ్లు కట్టాలనుకున్నారు. మరి అంత పొలం పారాలంటే మరో జత ఎద్దులు అవసరమైనాయి. ఎడ్లకు పైసలు లేక దున్నపోతులు కొన్నరు, ఇద్దరు కోడళ్లూ తెచ్చుకున్న బంగారపు గాజుల జతలు కుదువబెట్టి. బంగారం ఏమన్నతింటమా, ఇట్ల పని ఇస్తే చాలు కద అని, రాధమ్మ, అరుణమ్మ ఒకళ్లకొకళ్లు చెప్పుకున్నరు. అదీ కాక ఆ రోజుల్లో బంగారం కన్న ఎడ్లకే ఎక్కువ విలువ, ప్రాముఖ్యత.

అదేరోజు మొదటిసారి ఇద్దరన్నదమ్ములూ బాధపడ్డరు, ఒకళ్లకు తెలియకుండా మరొకరు. అంతలోనే మొదటి కారు పంటతోటే భార్యల వస్తువులు విడిపిస్తామని సర్దిచెప్పుకున్నరు ఒకరితోటి ఇంకొకరు. ఆరోజుల్లో రెండెకరాలు పొలముండటమే వున్నవాళ్లకూ, లేనివాళ్లకూ తేడా. పోయింది వాళ్ల సొమ్ములే అయినా, ఊళ్లో అందరిలో వెనకడివుండనందుకు ఆడవాళ్లు కూడా అనుకున్నరు. అప్పట్లో వున్న ఊళ్లో సరిగ్గా బతికితే చాలు అనుకునే వాళ్లు, చెప్పుకోవడానికే ఒక కథలా వుంది.

ఎట్లా అయితేనేం, కళ్లు మూసి తెరిచేలోపు మరో నాలుగు కాలాలు తిరిగిపోయాయి. అంటే ఏడేళ్లు. వ్యవసాయదారుడు ప్రతి ఏడేళ్లకూ ఒక్క కరువునైనా ఎదుర్కోవాలట పెద్దవాళ్లు చెప్పే మాటే. అందుకే అయిదారు మంచి కాలాలు అయితే ఇక రేపో మాపో నీళ్లు లేక గడ్డి కూడా మొలవని కరువు కాలమొకటి తప్పక వుంటుంది అని నానుడి. ఇది తాతల ముచ్చట అయినా వ్యవసాయాన్నే నమ్ముకున్న వాళ్లకు ఒక రకంగా ఊరటనిచ్చే విషయం కూడా.

సోమన్న ఎంతో గర్వంగా చూసేవాడు అన్నకొడుకును. వాడినితనే ఊళ్లో నాలుగో తరగతిదాకా వున్న ప్రైమరీ స్కూలుకు తీసుకెళ్లి తీసుకొచ్చేవాడు. వాడు అక్షరాలు దిద్దుతే తనే నేర్చుకున్నట్టు సంబరపడిపోయేవాడు. అడుగక పోయినా వాడికి నువ్వుండలూ నిమ్మ గోళీలూ కొనిపెట్టేవాడు. వాడంటే సోమన్నకు ఎంత ఇష్టమో, వాడికీ చెట్లెక్కి సితపాల పండ్లు కోసిపెట్టే చిన్నాన అంటే అంతే ఇష్టం.

కాలం ఎట్లా వుంటుందో ఎవరూ చెప్పలేరు, పెరిగే కుటుంబం మాత్రం ఆగదు. ఈ ఏడేళ్లలో అరుణమ్మకు ఇద్దరు కొడుకులూ ఒక కూతురు పుడితే రాధమ్మకు మొదటికొడుకు తరువాత పుట్టిన ఇద్దరూ కూతుళ్లే. కొడుకులను బడికి పంపి, కూతుళ్లను పనిలోకి దించడం ఆ ఊళ్లో అంతో ఇంతో పొలమున్న వాళ్లంతా చేస్తున్నపనే.

కాలం ఎట్లా వుంటుందో ఎవరూ చెప్పలేరు, పెరిగే కుటుంబం మాత్రం ఆగదు. ఈ ఏడేళ్లలో అరుణమ్మకు ఇద్దరు కొడుకులూ ఒక కూతురు పుడితే రాధమ్మకు మొదటికొడుకు తరువాత పుట్టిన ఇద్దరూ కూతుళ్లే.

కొడుకులను బడికి పంపి, కూతుళ్లను పనిలోకి దించడం ఆ ఊళ్లో అంతో ఇంతో పొలమున్న వాళ్లంతా చేస్తున్నపనే.

ఇద్దరు కోడళ్లకూ తిరిగి రావలసిన గాజుల బదులు, అవి విడిపించగానే ఒక్కో కూతురికీ చెవి పోగులు చేయించారు. పోగా మిగిలిన డబ్బుతో మళ్లీ బంగారం కొనేందుకు బదులుగా ఒక అయిల్ ఇంజన్ కొంటే ఎట్లా వుంటుందీ, అని ఆలోచించారిద్దరు అన్నదమ్ములూ. ఇప్పటికే తమబావికి చుట్టుపక్కలే మరో అయిదుగురైనా తవ్వి వరినాటు పెడుతున్నరు. తమ కుటుంబమే వెనుకబడిపోతున్నట్లు లోలోపల ఒక భావన. ఇన్నాళ్లూ లేని చీడలూ పురుగులూ ఇప్పుడిప్పుడే ఒక పొలానికొచ్చిన రోగం మరొకదానికి సోకుతున్నయని అనుమానంగా కూడా వుంది. కానీ వున్న రెండు అరకల పశువులకూ మేతైనా దొరుకుతున్నది అనిపిస్తున్నదే తప్ప, ఇంట్లో ఇదివరకున్న పరిస్థితికి భిన్నంగా ఏదీ లేదు. ఇంతాజేసి వారమంతా పిండివంటలు తిన్నదీ లేదు.

అయినా ఇదొక పోరాటం. వ్యవసాయమంటేనే ఒక పోరాటం అని ఇద్దరూ సర్దిచెప్పుకున్నరు. కుటుంబమంతా ఆ మాట అర్థం చేసుకున్నట్టే అనిపించేది.

డీజెలింజను వచ్చింది అనుకున్నట్టే. దానికితోడు నెలకొద్రమ్ము డీజెలు కూడా తెచ్చుకునే వాళ్లు పొలం పారాల్సిన రోజుల్లో. పంట చేతికి వచ్చినట్టే వచ్చి డబ్బులు చిక్కినట్టే చిక్కి అక్కడక్కడే అయిపోయినట్టుగా వుండేది. కాకపోతే ఇంట్లో నలుగురు పెద్దలూ, ఆరుగురు పిల్లలూ ఒంటినిండా గుడ్డల వరకైతే కొదువలేకుండా గడుపుతున్నామనే తృప్తి అంతే.

మగపిల్లలంతా వూళ్లో వున్నంత వరకూ చదివి పైవాటికి పక్కనే వున్న మరో ఊరికి వెళ్లేవారు. మిగతా వాళ్లకు అదీ లేదు. ఆడపిల్లలు తమ పేర్లు తాము రాసుకోగలరు. అదీ ఒకటి రెండు తరగతులు చదివారు కనుక. ఇంతలోనే అరుణమ్మ పెద్దకూతురు ఎదిగి వచ్చింది.ఉన్నది ఒక్కకూతురే కనుక పెండ్లి సరైన వాళ్లింట్లో, అంటే తమకన్నా హెచ్చు కుటుంబానికిచ్చి చేయాలని ఆవిడ కోరిక.

పెద్దగా ముడుపు కట్టిందేమీ లేదు కనుక అన్నదమ్ములిద్దరూ కలసి ఆలోచించారు. చెరొక ఎకరం కలిపి మొత్తం రెండూ ఒక మూల దిక్కుగా అమ్మేస్తే పిల్ల పెళ్లి అవుతుందని ఒక అభిప్రాయం. తప్పదని ఆ నిర్ణయానికొచ్చారు కాకపోతే తండ్రి ఇచ్చిన భూమిని అమ్మాలంటే ఇద్దరికీ మనసొప్పలేదు. ఆ రోజుల్లో తాతల భూమిని ఆడపిల్లల పెళ్లిళ్లకు అమ్మిన వారు చాలా తక్కువ. ఏదో చేసి ఆడపిల్లను గడప దాటిస్తే, మగపిల్లలు వాళ్లకు చెందే భూమ్మీదనైనా ఆధారపడి బతుకుతారని ఒక ఆశ. మట్టి పని చేసుకునే వాళ్లకు మగపిల్లల మీద వున్నంత ఆడపిల్లల మీద వుండదు అనిపిస్తుంది కానీ, అప్పట్లో ఆ భూమ్మీద వచ్చే దాంతలో కోటలు కట్టిన వాళ్లు ఎవరూ లేరు గనుక ఆడపిల్లలకు అంతలో ఇంతో తర్వాత్తర్వాత చెందేలా చూస్తామని ఆశచూపడం ఆనవాయితీగా మారింది.

అన్నదమ్ముల ఆలోచన అట్లా వుంటే, అరుణమ్మకు ఈ విషయం వేరే కారణంతో నచ్చలేదు. ఎందుకంటే తమకు వున్నదా ఒక్క కూతురు. తమవి

రెండెకరాలు ఇవ్వాళ అమ్మితే పనయిపోతుందనుకుంటే మరి రేపు రాధమ్మకున్న ఇద్దరు ఆడపిల్లల కొరకూ తామంతా కలిసి మరో నాలుగు ఎకరాలు అమ్మవలసి వస్తుందన్న సూక్ష్మం గ్రహించిందావిడ. ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్లూ పొత్తులో జరిగిపోతే వున్న ఇరవైలో ఆరుకరిగి పోతాయి. ముందే ఎవరిది వారుగా చెరి పది ఎకరాలూ తీసుకుంటే తమకు ఎనిమిది మిగులుతాయి కదా అని ఆవిడ ఆలోచన. తమకిద్దరు మగపిల్లలు కనుక వాళ్లు కనీస బతుకు బతకాలంటే పంచుకోవడమే మంచిదిగా తోచిందావిడకు. వున్న ఇరవైలో మొత్తం ఆరు ఎకరాలను ఉమ్మడి భాగంలో ఆడపిల్లల పెళ్ళిళ్లు అని తీసేస్తే తమకున్న మిగతా ఇద్దరు మగ పిల్లలకూ ఇగ మిగిలేది ఏదీ వుండదు. అదీగాక రాధమ్మ ఆడపిల్లలు ఇద్దరూ చిన్నవాళ్లు పెండ్లీలప్పటికి ఎట్ల వుండునో, ఇప్పుడంటే రెండు ఎకరాలు అమ్మితే జరిగిపోతుంది. వాళ్ల ఖర్చులు ఎంత పెద్ద వుండునో, ఏదైనా ఈ పొత్తు వ్యవహారం అంత మంచిది కాదని అరుణమ్మకు తోచింది. తమ ఇద్దరి మగ సంతానానికీ కలిపి మిగిలేది రాధమ్మ కొడుకొక్కడికీ వుండేదీ అంతే. ఎటువైపు నించి చూసినా, ఇదేం మంచి వ్యవహారంగా కనిపిస్తలేదని, తనకున్న అనుమానాలన్నీ భర్తకు చెప్పింది.

అదేమాట వెళ్లి అన్నతో పంచుకున్నాడు సోమయ్య. మన ఇంట్లో కూడానా అన్నట్టు మొఖం పెట్టిన చంద్రయ్య మరోమాట మాట్లాడలేదు. ఇప్పటికైనా మరదలు చెప్పిన విషయం పదిమంది లోనైనా బయటకొచ్చేదే అని తెలిసిన మనిషి ఆయన. అదీగాక ఇద్దరన్నదమ్ములకీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చూస్తే అదే న్యాయంగా తోచింది. ఇంట్లో మొహమాటాల వెరపుకన్నా బయట మాత్రం అంతా బాగానే వుందని చెప్పుకుపోతూ లోకానిక భయపడి గుట్టుగా బ్రతకాల్సిన రోజులాయె అవి. అసలు ఏ తిప్పలాలేకుండా వున్నాకూడా మందికి డీజెల్ ఇంజనులు వచ్చినయని మన మోటలను పక్కనబెట్టిన కాలం ఇది. ఉన్నొక్క బిడ్డనూ మంచి కుటుంబంలో ఇచ్చుకోవాలని ఎవరికి మాత్రం వుండదు, రాధమ్మ కూడా పెద్దగా అభ్యంతరం పెట్టలేదు ఇప్పుడైనా, ఇంకెన్నడైనా ఒక్కటే గదా, వున్న పది ఎకరాలనూ పంచే సమయమొచ్చేసిందని మొత్తం కుటుంబం గ్రహించింది. పంపకాలకూ్కడా ఒక టైముంటుంది, తమ్ముడు అతి చిన్నవాడైతేనో, పంచితే ఒకరు వారి బతుకు వాళ్లే బ్రతకలేకపోతేనే తప్ప ఉమ్మడిగా వుండటం అవసరమైనంత వరకే అయితేనే బాగుంటుంది. ఇద్దరు చేవగలిగిన స్వంత బతుకులు బతకగలిగే వాళ్లూ అయిన అన్నదమ్ములు విడిపోవటమనేది అనాదిగా వస్తున్నదే కనుక ఆ ఊర్లో ఇదేమంత పెద్ద విషయం కాలేదు.

ముగ్గురు మగపిల్లలూ ఒకే దగ్గర పెరిగినా ఎవరి పొలం వాళ్లూ, ఎవరి చెలక వాళ్లు ఏదెతే తమదో దాన్ని జాగ్రత్తగా చూసుకోవడం కూడా ఒక పద్ధతే. అయినా వాళ్లలో పొరపచ్చాలున్నట్లు కనిపించదు. పెద్దవాళ్లకు ఒకరకంగా సంతోషమే. మనుషులకు అన్నీ తెలిసే అవకాశం తక్కువే అదీ, అన్నీ సరిగ్గా సమకూరినపుడు.

ఊరిపెద్దలను నలుగురినీ పిలిచి ఒకే కాగిత మ్మీద వున్న ఇరవై ఎకరాలకూ సరిగ్గా సగంలోకి గీత గీశారు. ఆ చెల్కతోబాటుగా వున్న ఒక్క బావినీ కూడా సరిగ్గా సగంలోకి వచ్చేలా చూపిస్తూ. పెద్దల తోబాటుగా ఊరంతా చంద్రయ్యనూ సోమయ్యనూ మెచ్చుకుంది. కుటుంబమంటే ఇట్లా వుండాలనీ, కలిసి చేసుకున్నా విడిపోయి బతికినా వీళ్లే ఆదర్శమని.

ఇల్లును కూడా తోచిన మేరకు పంచుకున్నరు. అనుకోవడానికి అనుకున్నరు. పెద్దరుగు పెద్దాడికీ, చిన్నరుగు చిన్నాడికీ అని. వంటింట్లోకి చూసి వచ్చిన పెద్దలూ, తడికె కట్టుకుంటే ఇంటి వెనక నుండి ఒకరు నడవచ్చు ముందు ముందు అవసరం పడితే అని ఒక సలహా అయితే ఇచ్చారు. మళ్లీ వాళ్లే అట్లా ఎందుకూ, ఇద్దరికీ సమంగా వున్నట్లు వుంటుంది, ఇల్లును కూడా సరిగ్గా నడిమధ్యకు విడదీస్తూ ఒక అడ్డుగోడ కట్టేసి ఇద్దరికీ ముందునుండే గుమ్మాలు వచ్చేటట్లు చేస్తే అని తేల్చారు. ఇల్లును కొడుకులు పంచుకోవడం చూసి తల్లి ముసలావిడ తన వంతుకు ఒక ఏడుపు ఏడ్చి ఇక వదిలేసింది.

చివరికి మిగిలి వున్న ఒక్క డీజెల్ ఇంజిన్‌నూ, ఇన్నాళ్లూ ఇద్దరి పొత్తుతో సాగుతున్న పొలాన్నీ ఎట్లా పంచుకొని పారించుకోవాలో అర్థం కాలేదు. ఇన్ని పంపకాలూ పెట్టిన పెద్దలు ఆఖరికి నీళ్ల దగ్గరకొచ్చేసరికి ఎట్లా నడిపించాలో సరిగ్గా తెలియలేదు. పెద్దలంతా అంచె కల్లు తాగి, మధ్యాహ్న భోజనాలు కూడా కానిచ్చి వచ్చి చివరికి తమకు తోచిన రీతిలో చెప్పినారు.

ఉన్నదొక్క కాలువ, మొత్తం రెండు ఎకరాలకూ నీరిస్తుంది. ఇప్పుడు ఇంకొక సమాంతర పు కాలువ తీసినా ఇంజను ఒకే చోట నుండి పోస్తుంది కనుక నీళ్లను ఎక్కడో ఒకచోట సగం చేయక తప్పదు. మరి ఇంకొక మోటరు పెట్టుకునే తాహతు లేదు, అప్పోసప్పో చేసిపెట్టినా, అక్కడ చేస్తున్న సాగుకు అంత అవసరం లేదు. కనుక పెద్దలు ఆ పొద్దు చీకటి పడేవేళకు తేల్చినది ఒక కాటిమొద్దుతో సరిపోతుంది అని.

అన్న చంద్రయ్యకు అది సరిగ్గానే తోచింది. తమ్ముడు కూడా ఒప్పుకున్నడు అదే మాట. ఒక కట్టె మొద్దుకు రెండు గాట్లు పెట్టి ఒకే కాలువలో పాతితే రెండువైపులా నీళ్లు సమాంతరంగా పంచుతుంది అన్నది ఊళ్లలో ఇదివరకు చూసిన ముచ్చటే. ఇద్దరు తోటికోడళ్లకూ ఎందుకో ఆ మాట నచ్చలేదు. అన్ని పంపకాలూ జరిగినప్పుడు ఈ నీళ్ల దగ్గర మాత్రం పొత్తు దేనికి అని వాళ్ల అభిప్రాయం. ఇంట్లో ఆడవాళ్ల మాటలు విని చెడిన వాళ్లు వాళ్లు చాలా తక్కువ అని వాళ్లకానాడు తోచలేదు.

భార్యలకే గాక తమకు తామే సంజాయించుకున్నట్టు అన్నదమ్ములిద్దరూ అనుకున్న మరోమాట పిల్ల పెళ్లవగానే ఇంకో ఇంజను కొందాం అని. అప్పుడైతే ఇద్దరూ ఎవరికి తోచినట్టు వాళ్లు బావికి రెండు వైపుల నుండి నడిపించుకోవచ్చు కదా అనేది వాళ్ల ఆలోచన. అదొక పెద్ద అనవసరపు ఖర్చు అనిపించినా సరే.

భూమి ఎవరిది వాళ్లు చేసుకున్నాక ఆ తరువాత ఏడు, తమ్ముడే చెప్పాడు. అంతా కరెంటు మోటర్లు పెట్టుకుంటున్నరు, ఈ డీజెల్ ఖర్చు, భరించలేక మనమూ అదే చేద్దాం అని. అన్న చంద్రయ్య ఏం మాట్లాడలేదు. డీజెల్ పంపు వచ్చి పదేళ్లు తిరక్కుండానే సగం చేసాం భూమిని, మరి కరెంటు మోటరొచ్చి ఇంకేం చేస్తుందో అని ఆయన భయం.

అనుకున్నట్లే అరుణమ్మ బిడ్డ పెళ్లి కుదిరింది. పెళ్లికి రెండెకరాలూ సోమయ్య ఒకడే తన దాంట్లోంచి అమ్మేశాడు. తమ తండ్రి ఇచ్చిన శరీరంలో ఒక భాగం తక్కెడలో పెట్టి అమ్మేసినట్లు అనిపించినా, ఒకపెద్ద బాధ్యత తీరింది, ఇక ముందు ఏమైనా సరే సరి చెప్పుకున్నాడు సోమయ్య. పెండ్లి ఖర్చు అనుకున్నదానికన్నా ఎక్కువైంది అదో రివాజన్నట్టు. కరెంటు మోటారు తేవాలంటే ఖర్చు ఎక్కువైతుందని ఆ ఏడు మానుకున్నాడు.

ముగ్గురు మగపిల్లలూ ఒకే దగ్గర పెరిగినా ఎవరి పొలం వాళ్లూ, ఎవరి చెలక వాళ్లు ఏదైతే తమదో దాన్ని జాగ్రత్తగా చూసుకోవడం కూడా ఒక పద్ధతే. అయినా వాళ్లలో పొరపచ్చాలున్నట్లు కనిపించదు. పెద్దవాళ్లకు ఒకరకంగా సంతోషమే. మనుషులకు అన్నీ తెలిసే అవకాశం తక్కువే అదీ, అన్నీ సరిగ్గా సమకూరినపుడు. పిల్లలు కలిసి వుండటానికి కారణం సోమయ్యకు అన్నకొడుకు మీద చిన్నప్పటి నుండీ వున్న ప్రేమ ఏ మాత్రం తగ్గకపోవడమే అయుండవచ్చు. సోమన్న ఏది ఇంట్లోకి తెచ్చినా అందరు పిల్లలకూ కలిపే తెచ్చేవాడు. అట్లాంటి భావన కారణంగా రెండు కుటుంబాలకూ ఇంకా కలిసి వున్నామన్న ఒక ఊరట వుండేది.

చంద్రయ్యకు పైభాగాన భూమి వుండి చిన్నవాడికి కింద భూమి రావడంతో వరి పొలానికి మళ్లు అన్నీ నిండే సరికి సమయం పట్టేది. అదీగాక కిందుగా వున్న మళ్లలో నీళ్లెక్కువై పైవాటికి తక్కువయ్యేవి. ఇట్లా కాదని రెండు సమాంతర కాలువల్లో ఒకేసారి నీళ్లొదిలేలా చేసుకున్నరు. మోటరు పోసిన కాడ ఒక పెద్ద కాలువ తీసి కాటిమొద్దు వేసుకుంటే అదే మొద్దు రెండు కాలువల్లోకీ సరిగ్గా విభజిస్తుందన్నది ఆలోచన. అనుకున్నదే తడవు ఇద్దరన్నదమ్ములూ అమల్లో పెట్టారు ఆ ఆలోచనని. ఒకే చెక్క మొద్దుకు రెండు సమానమైన గాట్లు వేసి అంతవరకూ చెక్కని తీసేసి కాలువలో నాటి ఇక ఆ నీళ్లు చెరి సగం అవడం మొదలయ్యాక తమ ఇద్దరి మీది నుండీ పెద్ద భారమేదో ఆ కాటిమొద్దు మీదికి మారినట్లు ఇద్దరూ తేలిక పడ్డారు.

ఒక సంవత్సరం పంట సరిగ్గానే పండింది కానీ అనుకున్నట్లు మిగల్లేదు. కరెంటు మోటరు ఆశ ఆశగానే మిగిలింది సోమయ్యకు. అతని బాధను చూడలేక భార్య అరుణమ్మ చెప్పింది తను మెడలో పచ్చ తాడు కట్టుకుంటాననీ, ఒక్క సంవత్సరంలో గనక తనకు మళ్లీ కొనియ్యగలిగితే అని. మునుపు తీసు

కున్న గాజులెట్లా తేలేది-అని ఆవిడ ఎన్నడూ మాట వరసకు కూడా ఒక్క మాట అన్నది లేదు కానీ సోమయ్యకే ఆ విషయం గుర్తుకొచ్చి కళ్లు చెమ్మగిల్లాయి. ఆవిడ చెప్పింది నీళ్లు పుష్కలంగానే వున్నాయి గనుక కరెంటు మోటరొస్తే ఇంకో ఎకరం అచ్చుకడదామని అన్నను అడిగి చూడమని.

తమ్ముడు అడిగినప్పుడు అతని కళ్లలో డీజెల్ ఇంజెను తెచ్చినప్పుడు చూసిన మెరుపును మళ్లీ చూసో మాట కాదనలేకో మరి చంద్రయ్య తల ఊపాడు. తమ్ముడు కొత్త మోటరు తెచ్చి పాత డీజెలు ఇంజను స్థానంలో పెట్టాడు, ఇక అన్నకు కూడా కొంత డీజెలు ఖర్చు తప్పుతుందని. తాను ఇంజను తన పైకం పెట్టి కొన్నాడు కనుక అన్న తనను కింద మరొక ఎకరం అచ్చుకట్టుకుంటానంటే సరేనన్నడు.

తమ్ముడు పెంచుకున్న తన వరిపొలంలో వచ్చిన తేడా ఆ ఒక్క కారుకే తెలిసింది. తమ్మునికి ఆరు పుట్లు పండితే అన్నకు మూడే అయినయి. ఎవరి కల్లాలు వాళ్లు చేసుకుని వచ్చినాక అరుణమ్మ తన మగడు అప్పుడే కల్లం మీది వడ్లకు అడ్వాన్సు తెచ్చి విడిపిచ్చిన బంగారు గొలుసు తెచ్చుకుంది.

రాధమ్మక్కూడా తోచింది మరి వాళ్లకు ఎనిమిది ఎకరాలే వుండి రెండిట్లో తరిపెడుతున్నప్పుడు పది పంచుకుని తాము మాత్రం తక్కువెందుకు అచ్చుకట్టాలి అని. ఈసారి చూద్దాం అన్నాడు చంద్రయ్య.

ఇవి పెద్దవాళ్లకు చిన్నవిషయాలుగా అగుపడ్డా ఇంట్లో చంద్రయ్య పిల్లలకు అన్యాయం జరిగిపోతున్నట్లు అనిపించింది. అటు సోమయ్య పిల్లలకూ అంతే, తమ తండ్రి స్వంత ఆలోచనతో తెచ్చిన కరెంటు మోటరులో పెదనాన్న ఎందుకు పని తీసుకోవాలి, అదీగాక ఆయనకు ఇక ముందు కూడా డీజెల్ ఖర్చు తగ్గినట్టే కదా అనిపించింది వారికి. ఎంత చిన్నవాళ్లైనా ఊళ్లల్లో ముఖ్యంగా వ్యవసాయదారుల ఇళ్లల్లో పెద్దగా తెలియని విషయాలంటూ వుండవు. ప్రతిదాన్నీ సరిచూసుకోవటం కూడా బాగా అలవాటైన విషయమే. పెద్దవాళ్లకు పట్టువిడుపులు తెలుస్తయి కొన్నిసార్లు, చిన్నవాళ్లకు ఆ జ్ఞానం తక్కువే.

ఆ వచ్చే కారుకు చంద్రయ్య కూడా మరొక ఎకరం ఎక్కువ తడపంట, సోమయ్య కూడా ఆ వస్తున్న నీళ్లనుబట్టి పొలాన్ని పెంచి మొత్తం మూడు అచ్చుకట్టడం చకచకా జరిగినయి. మొత్తానికి అన్నదమ్ములిద్దరూ ఇదివరకు కలిసి వుండి మోట కట్టిన నాటి కంటే ఇవ్వాళ నాలుగింతలు వ్యవసాయమైతే చేస్తున్నరు. మరి మిగలడం అన్నిపాళ్లూ పెరిగిందా అని ఎవరూ అడగలేదు వాళ్లను. ఎందుకంటే ఆ ఊళ్లో ఎవరేది వ్యవసాయం గురించి మాట్లాడవలసి వచ్చినా ఆకాశం కేసి చూసి వ్యవసమనే వ్యసనం చేసి కార్లు కొన్న అడ్డగాడిద ఎవడూ అని చిరాగ్గా మాట్లాడే వాళ్లే. వెనకటి చెల్కల్లో పండింది తిని బ్రతికినప్పుడు ఈ కంపారిజన్ లేకపోవడం అప్పటి వాళ్లు చేసుకున్న అదృష్టమయి వుండవచ్చు.


సోమయ్య కూతురి పెళ్లయిన రెండేళ్లకు చంద్రయ్యా తన కూతురికి పెళ్లి చేసే వుద్దేశ్యం చెప్పొకనాడు తమ్ముడితో, తనవి ఒకటో రెండో ఎకరాలమ్మే బదులు కాలం మంచిగయితే ఈ పిల్ల పెళ్లి అవుతుందని ఆయన అనుకున్నాడు. అట్లా జరిగే వీలు లేదని చరిత్ర మళ్లీ మళ్లీ చెప్పినా సరే.

ఆ ఏడు పంట అనుకున్నంతగా రాలేదు. మొత్తానికి ఇద్దరి సంతానం ముగ్గురు మగపిల్లలు కూడా పదో తరగతి పాసై టౌనుకు ఇంటరు చేస్తమని వెళ్లినప్పటినుండి ఖర్చులు ఎక్కువయినయి. బావిల నీళ్లు లోతుకు పోతున్న కొద్దీ పూడిక అనీ కొంతా ఒక్కో గజం ఒక్క ఏడు తియ్యాలని ఎవరో లెక్కచెప్పినట్లు ఆ వున్న ఒక్క బావినీ పాతాళం దాకా తవ్వడమైనది. కరెంటు మోటరు ఒక్క నాల్గు హార్సులది పోయి రెండు ఒక దానికొకటి జతగట్టి వాడవలిసి వచ్చింది. మొదట వచ్చినట్టు కాక ఈ మధ్య కరెంటు బిల్లు పట్టుకుంటే శాక్ కొట్టేలా వుంది.

వీళ్ల పొలాలకు పైవాడూ కిందివాడూ వాళ్ల బావుల్లనే బోర్లేసినరు. అందరి నీళ్లూ మరింత లోతుకు పోయనయి. ఎవరు ఎంత అచ్చుకట్టినారు అనేది పోయి కొత్త రకం పోటీ మొదలైంది. ఎవరికెన్ని తలకెక్కలేదు, ఎండుతున్న సొంతపొలమే తమ్ముని తలలో తిరుగుతున్నది. ఇంట్లో ఆడవాళ్లు నీళ్ల పంపకాలు ఎన్నటికీ కుదరవు అని చెప్పిన మాటలు మళ్లీ గుర్తొచ్చినయి.

చంద్రయ్యకు కొడుకు నెలనెలా డబ్బులు పంపమని రాసిన కార్డు ముక్క ఆయన జేబుల నలుగుతున్నది. బిడ్డపెండ్లి చేసినాక డబ్బులకు కటకటా వుండ కూడదు మరి ఇదెక్కడి సంగతి.

ఆ ఏడు ఎకరానికి నీళ్లు అందవలసినంత అంద లేదు మొదటిసారి కోతలయినాక, కొంత చల్లబడ్డాక, అన్న చెప్పిన మాట అర్థమవుతున్నది. నీళ్లే మరీ లోతుకు పోయినయి, ఇద్దరివీ మొత్తం ఎనిమిది ఎకరాలూ తడిపే సామర్థ్యం బావికిక లేదు అని. ఎవరు తగ్గించుకోవాలి, ఇద్దరివీ ఖర్చులు ఇప్పుడే మొదలయినట్టు తోస్తున్నది. తమ ఇద్దరి ఎకరాలూ ఎవరో సగానికి తుంచినట్టూ, ఆ భూమీ కుంచించుకుపోయినట్టూ అనిపిస్తున్నది.




బోర్లు వున్నయి, ఎంత లోతునుండి అవి నీళ్లు పోస్తున్నయి, కొత్త భాష, కొత్త భావనలు ఆనాడే పుట్టినయి. ఒక్క బోరు మోటరు పట్టుకుని తిప్పే యాదగిరి నాలుగు బోర్లు కొన్నడు. వడ్డెర్లంతా పట్నం పయనమైనరు పనుల్లేక. చంద్రయ్య, సోమయ్య పూడిక తీస్తందుకు మళ్లీ ఒకసారి బావిల దిగినరు ఆ ఏడు.

ప్రతి దానికీ మొదటి సారి వుంటుంది. మొదటి సారి చంద్రయ్య మీద తడిపిన ఎకరానికి నీళ్లు అంద లేదు అని నారు అలకడం మానేసాడు. సోమయ్య పొలానికీ సరిగ్గా అందలేదు కనుకనే ఆయనదీ ఒక ఎకరం ఎండి పోయింది, అదీ మొదటిసారే. ఎరువులు, మందులు, గోళీలు మాత్రం మునుపు పట్టినట్లే పట్టినయి.

మొదటిసారిగా చంద్రయ్య అన్నమీద అరిచినాడు అందరి సమక్షంలో, అదీ ఇంట్లో. కాటిమొద్దు నీళ్లు పంచే చోట సరిగ్గా నీళ్లు పంచకనే తన అర ఎకరం ఎండింది అన్నడు. అన్న చెప్పిన విషయం, ఆయన కూడా ఒక ఎకరం తక్కువే పెట్టినాడనేది అన్నతో చెప్పాడు, బావిలో ఒక బోరు వేద్దామని. అన్న వద్దన్నడు.

"అన్నిటికీ అడ్డమొస్తన్నవు అన్నా నువ్వు. నేను చెప్పినట్టు ఆ బావి తవ్వి వుండకపోతే, ఆ డీజిల్ ఇంజన్ తెచ్చి వుండకపోతే, కరెంటు తెచ్చి పెట్టకపోతే నువ్వు నీ బిడ్డల పెండ్లీ, నేను నా బిడ్డ పెండ్లీ చేయగలిగే వాళ్లమేనా'' అన్నడు.

"అన్నా ఈసారి నువ్వు కలిసి రాకపోతే నాకు బావిలో పంచి ఇవ్వు, నా వైపున్న దాంట్లో బోరు వేసుకుంటా'' అన్నడు.

కాళ్వాల కాటి మొద్దు పడి సరిగ్గా పదేండ్లు కూడా కాలేదు ఆ నాటికి.

"సోమన్నా నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో అంతే కాని ఈ బాయిల బోరేసేది లేదు'' అన్నడు.

''అంతగా కావాలంటే వేరేకాడ వేసుకో నీ భూమిల'' అని చెప్పిండు చంద్రన్న.

"కానీ ఆ బావి వున్న కాడ నీళ్లున్నయని గ్యారంటీ వున్నది, అందులో నీళ్లు పడకపోతే నిన్నొక్క పైస కూడా అడగను'' ఓడిపోకూడదన్న

పట్టుదల తమ్మునిది.

"సరే నీ ఇష్టం" అన్నాడు చంద్రన్న. భవిష్యత్ తెలిస్తే అన్న కూడా ఆ నాడే స్వంత బోరు వేసుకుంటే పోయేటిది. ఎవరి మోటర్లు వాళ్లు పెట్టుకుంటే సరిపోయేది. కానీ ఒకే బావిలో రెండు బోర్లు ఒకేసారి వేయడం మూర్ఖత్వంగా తోచింది. ఒకే చూరు కింద రెండు కుంపట్లు వున్నప్పుడు ఇక రెండు బోర్లు వుంటే తప్పేమిటి అని ఎవరూ అడగలేదు. మనుషులతో పనిలేని కాలానికి తెలియని విషయం, వాళ్లకున్నంతలో అప్పుడు అది జరిగేది కాదు అని.

ఒక బోరు నూరు ఫీట్లు వేస్తే నీళ్లు కొద్దిగా వచ్చినై. అన్న పెదవి విరిచిండు. ఇది కూడా ఒక్క కారుమటుకే అని. తమ్ముడు కూడా నిరాశ చెందినా అది కనిపించనీయలేదు. ఆ ఏడు ఎట్లాగైనా ఆ కింది ఎకరం ఎండకుండా చూడాలన్నదే అతని పట్టుదల.

అన్నీ అనుకున్నట్టే జరిగితే ఇక జీవితమేమున్నది.

ప్రతి దానికీ మొదటిసారి వుంటుంది. ఆ రోజు మొదటి సారి అన్న తమ్మునిమీద నోరు పారేసుకున్నడు.

కాటిమొద్దు కాడ నీళ్లు కింది వైపు ఎక్కువ పోతున్నయని, మరి తన పొలం ఎండదా అని. ఇంట్లో ఆడవాళ్లు మొదటిసారి ఎదురుపడి తిట్టుకున్నరు.

టౌను చదువులు చదువుతూ సెలవుల్లో ఇంటికొచ్చి పోయే చంద్రయ్య కొడుకు చిన్నాయనను మళ్లీ ఒకసారి కాటిమొద్దును ముట్టుకుంటే చేతులు విరగ్గొడతానని చెప్పిండు. వాడు పుడతాడని వదిన చెప్పిన రోజు తామంతా చేసుకున్న సంబరం గుర్తొచ్చింది ఇన్నేండ్లకు సోమయ్యకు. కండ్లు మూసుకున్నడు, ఇంకొక పదిహేను రోజులైతే వరి ఇవతల పడ్తది. అవును అన్నకు చెప్పి చేస్తే అయిపోయేది, పొట్టకొచ్చిన పొలాన్ని చూస్త చూస్త ఎండబెట్ట బుద్ధి కాలేదు.

కాటిమొద్దు ఇస్తున్న తీర్పు సరి అనిపించలేదు మొట్టమొదటిసారిగా. అందుకే అన్న వైపు ఇంత ఇసక తోశాడు కాలితో, రెండు వారాల తర్వాత మళ్లీ చదును చేసేవాడే కానీ అన్నకొడుకు ఆ విషయం గమనించినట్టున్నాడు. వాళ్లు కూడా మరి క్రితం సారి తడపని ఎకరాన్ని కూడా నాటు పెడుతున్నారు. అదే మాట అన్న తనతో చెప్పి పెడితే సరిపోయేదేమో కానీ తను వద్దనే వాడు. ఆ బోరేసిన ఖర్చు వెళ్లిపోవాలంటే ఇద్దరూ నాట్లు పెడితే అయ్యే పని కాదు. తను బోరేసినందుకు అన్న తీరుస్తానని అన్నప్పుడు తనర్థం చేసుకోవలసింది, ఆ ఎకరం నాటు పెడితేనే ఆయనా తీర్చగలడని.

కాటిమొద్దు ఇస్తున్న తీర్పు సరి అనిపించలేదు మొట్టమొదటిసారిగా. అందుకే అన్న వైపు ఇంత ఇసక తోశాడు కాలితో, రెండు వారాల తర్వాత మళ్లీ చదును చేసేవాడే కానీ అన్నకొడుకు ఆ విషయం గమనించిన ట్టున్నాడు. వాళ్లు కూడా మరి క్రితం సారి తడపని ఎకరాన్ని కూడా నాటు పెడుతున్నారు. అదే మాట అన్న తనతో చెప్పి పెడితే సరిపోయేదేమో కానీ తను వద్దనే వాడు. ఆ బోరేసిన ఖర్చు వెళ్లిపోవాలంటే ఇద్దరూ నాట్లు పెడితే అయ్యే పని కాదు. తను బోరేసినందుకు అన్న తీరుస్తానని అన్నప్పుడు తనర్థం చేసుకోవలసింది, ఆ ఎకరం నాటు పెడితేనే ఆయనా తీర్చగలడని.

అన్న కొడుకు రేచుకుక్కలాగా లేసిండని కాదు కానీ, తను తప్పు చేసినవాడిలా ఇంతబతుకు బతికీ తల దించుకోవలసి వచ్చింది అని బాధ అయింది.

ఎవరు బాధపడ్డా పడకపోయినా పండగ లాగవు. పరీక్షలాగవు, ఎండాకాలం సెలవులాగవు. సోమయ్య ఇద్దరు కొడుకులూ పరీక్షలు కాగానే వచ్చారు. చివరి రోజుల్లో ఇంకా ఎండుతున్న ఎకరం కథ విన్నరు. ఇప్పటికైనా దానికి నీళ్లిచ్చి బతికించుకోవచ్చు కదా అని అడిగినరు తండ్రి సోమయ్యను.

పెదనాన్న కొడుకు తమ తండ్రినే కొడుతామంటరా అని రోషానికి పోయినారు.

పక్కింట్లో సోమయ్య కొడుకులు వాళ్ల తండ్రి మీద చేస్తున్న కోపాన్ని అరుగుమీద కూర్చుని వింటూ ఊరుకోలేక చంద్రయ్య తన కొడుకును మందలించాడు. పెద్దవాళ్ల గొడవల్లో తలదూర్చి తప్పు చేసినావని చెబితే తల్లి రాధమ్మ కొడుకునే సమర్థించింది. "ఇవ్వాళ కాక పోతే ఇది రేపైనా వాడిదే కదా, " అని,

"పిల్లలాటకు పోతే ఇక్కడ ఎవరూ బాగుపడరు" చెప్పి చూశాడు చంద్రయ్య.

" ఆ మాట మొదటగా వేరుపడదామన్న వాళ్లకు తోయాలి" రాధమ్మ కొడుకు వత్తాసుగా నోరు పెద్దది చేసింది.

"వేరుపడ్డం వల్ల ఇద్దరమూ ఇంత బాగుపడ్డామే తప్ప చెడిపోయింది లేదు. వేరు పడేప్పుడున్నట్లే మన మనుషులమూ వుండి వుంటే ఇంతకాడికొచ్చేది కాదు," చంద్రయ్య తన వాదన వినిపించడానికి చేస్తున్న ఆఖరి ప్రయత్నం ఆ ఇంట్లో ఇక చెల్లట్లేదు.

సోమన్న తన కొడుకులతో ఏం చెప్పలేక కోపంగా ఇద్దరినీ భార్యనూ అనవసరంగా పెద్ద విషయం చేస్తున్నందుకు ఒకతిట్టు తిట్టి రుమాల భుజానేసుకుని బయటకెళ్లిపోయినడు.

తమ్ముడి కోపాన్ని, అతడు బయటకెళ్లిన తీరు చూసి ఇక వుండబట్టలేక చంద్రయ్య తన అరుగు దిగి పక్కనే వున్న తమ్ముడి గడప ముందు నిలబడి, అరుణమ్మా సోమన్నను ఆ ఎకరం ఎండకుండా చూసుకొమ్మను అని చెప్పి వచ్చి కూర్చున్నడు.

అది విన్న చంద్రయ్య కొడుకు ఇంట్లోంచి పరుగెత్తి పొలం వైపు వెళుతూ వుంటే తల్లి వెనుకనుంచి అరిచి చెప్పింది, వద్దురానాయినా దీన్ని పెద్దగ చెయ్యకు. రేపోమాపో అదే బాయి నిండి అందరికీ పండుతయి, " అని వెనకనుంచి

వాడు కాస్తా కాలిబాట పట్టుకుని బావివైపు అందుకున్న పరుగుతో ఆవిడ కేక వాడిని చేరినట్టు లేదు. చెట్ల చాటున మాయమైనాడు.

సోమయ్య పిల్లలిద్దరూ ఇప్పటికే తమ ఎండుతున్న పొలానికి నీళ్లకోసం అడిగితే లేదన్న వాళ్లు ఇవ్వాళ ఆ పొలాన్ని బీడు పాడు చెయ్యడని నమ్మకమేమున్నది అని ఒకడు పలుగు ఇంకొకడు గడ్డపార తీసుకొచ్చి వాళ్ల గడప బయట నిలబడ్డరు.

పెదతండ్రి చంద్రన్నను చూస్తూ "వాడు గనుక ఏమన్నా చేస్తే ఇయ్యాళ ఇక్కడ మీరో మేమో వుంటం," అని హూంకరించారు కూడా.

అయిదు నిమిషాలు కూడా కాలేదు చంద్రయ్య కొడుకు గోడకు కొట్టిన బంతిలాగే చెట్ల చాటు నుంచి వెళ్లిన వేగంతోనే వస్తూ కనిపించాడు అందరికీ. వాడి భుజమ్మీద ఒక కట్టెమొద్దు. అది కాటిమొద్దు అని తెల్చుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదెవరికీ. వస్తూనే ఆ మొద్దును తీసుకొచ్చి దాని మీద ఇంత వుమ్మి వేసి అదే మొద్దును చిన్నాయన ఇంటి మొదట్లో విసిరేశాడు, తనవైపే కోపంగా చూస్తున్న చిన్నాయన కొడుకులిద్దరివైపూ ఛీత్కారంగా చూస్తూ. చంద్రయ్య తన నులక మంచం మీదినుంచి లేచే ఓపిక కూడా లేనట్లు ఒళ్లంతా చచ్చుబడ్డట్లు చూశాడు ఇంకా పరుగుతో వచ్చి వగరుస్తున్న కొడుకు వైపు.

"నాయినా ఆళ్లనే కాల్వ మొత్తం పారించుకోమ్మను నీకు నాకు బువ్వ పెట్టనిది ఒక రూలు పెట్టుకున్నంక దాన్ని మన ఇష్టం వచ్చినట్లు మార్చుకునేటందుకు ఈ అక్కరకు రాని కాటిమొద్దు వుంటేనేం లేకపోతేనేం, ఆళ్లనే బతకమను." ఇంకా కోపం తీరక అరిచాడు వాడు వెనక్కు వస్తూ.

సోమన్న కొడుకులు ఇద్దరికీ ఇట్లా చేతులు కట్టుకుని మాటలు పడే అవసరమున్నట్లు కనిపించలేదు. అందులో పెద్దవాడు, చేతిలో వున్న గడ్డపారను పక్కకు విసిరేసి తమ వాకిట్లో పడున్న కాటిమొద్దును తీసి అక్కడున్న వాళ్లంతా తేరుకునే లోపలే చంద్రన్న కొడుకు మీదికి వెనకనించి వెళ్లి వాడి తలపై ఒక్క మోదుడు మోదాడు.

"అమ్మా," అంటూ వాడు అక్కడే కుప్పకూలాడు తలపచ్చడై. కొడుకునేల కూలడం చూసిన రాధమ్మ ఒక్కపరుగు పెట్టింది కిందపడున్న వాడిదగ్గరికి.

ఇంటికి కూతవేటు దూరంలో మేకలకు తుమ్మ చెట్టు మండకొడుతున్న సోమన్న కూడా విన్నడు ఆ "అమ్మా" అన్న అరుపును. పరుగెత్తుకు వస్తూనే రక్తపు మడుగులో విగతజీవుడై పడి వున్న అన్నయ్య ఒక్కగానొక్క కొడుకును, వాడి శవం మీదపడి ఏడుస్తున్న వదిననూ చూశాడు.

"నాయినా నువ్వాగు," అని చిన్నకొడుకు మాట నోరు దాటకమునుపే సోమయ్య కొడవలి తన పెద్దకొడుకు మీద ఒక్క వేటు వేసింది. వాడు కళ్లల్లో ఆశ్చర్యంతో తండ్రి వంకే చూస్తూ నేల కొరిగాడు.

"హయ్యో కొడుకా,"అంటూ అరుణమ్మ తన కొడుకుజ్జూ కావిలించుకుని వాళ్ల గుమ్మంలో కూలబడింది.

కొడవలి పక్కకు పారేసి ఒక మొగురానికి జారిగిలబడ్డడు సోమన్న ఇంకా గాజుకళ్లతో మూగవాడిలాగా నులక మంచంలోనించి లేవని అన్న చంద్రయ్య కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తూ.

కాలంగాని కాలంలో ఆకాశం కూడా ఏడుస్తున్నట్లు సన్నటి చినుకులు.

★